ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 జనగామ

ఆదివారం 17 మార్చి 2024



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : ఆదివారం సా : 6.32 గం..

సహర్ : సోమవారం ఉ : 5.00 గం..


ప్రభుత్వ స్థలంలో గుడిసెలు

అడ్డుకున్న పోలీసులు, సీపీఎం నాయకుల అరెస్ట్

8లో



గోపాల్‌నగర్‌లో గుడిసెవాసులతో మాట్లాడుతున్న ఏసీపీ



'లోక్‌సభ'కు

మోగిన పార్లమెంట్ ఎన్నికల నగారా

- షెడ్యూల్ ప్రకటించిన కేంద్ర ఎన్నికల సంఘం
- ఉమ్మడి జిల్లాలో వరంగల్, మహబూబాబాద్ స్థానాలు
- గెలుపే ధ్యేయంగా ప్రచార పర్వంలోకి ప్రధాన పార్టీలు

(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

పార్లమెంట్ ఎన్నికలకు ఎన్నికల నగారా మోగింది. ఈ మేరకు శనివారం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడంతో రాజకీయపార్టీలు లోక్‌సభ సమరానికి సై అంటున్నాయి. దేశవ్యాప్తంగా ఏడు దశల్లో ఎన్నికలు జరగనుండగా.. నాలుగో దశలో మే 13న రాష్ట్రంలోని అన్నిపార్లమెంట్ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాలకు కూడా ఎన్నికలు నిర్వహించేందుకు చేయాల్సిన ఏర్పాట్లపై అధికార యంత్రాంగం దృష్టి పెట్టింది. ఇప్పటికే ఓటరు జాబితాలను సిద్ధం చేయగా.. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులకు, అభ్యర్థుల సమగ్ర వివరాల కోసం ఎన్నికల సంఘం ప్రత్యేక యాప్‌లను కూడా విడుదల చేసింది. మరోవైపు షెడ్యూల్ ప్రకటనతోనే శనివారం నుంచి అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేసే దిశగా అధికారులు దృష్టి సారిస్తున్నారు. ఇక పార్లమెంట్ ఎన్నికలపై గంపెడాశలు పెట్టుకున్న ప్రధాన పార్టీలు, అభ్యర్థులు ప్రజాక్షేత్రంలోకి వెళ్లేందుకు వ్యూహరచన చేసుకుంటున్నారు. శనివారం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రభుత్వ పథకాల అమలుకు, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు బ్రేక్ పడింది. కోడ్ ముగిసే వరకు అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ఉండదు.

విస్తృత ఏర్పాట్లలో అధికార యంత్రాంగం

ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక కీలకమైన ప్రాంతాలు, జిల్లాల సరిహద్దుల్లో పోలీసులు తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. రూ.50వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లితే, దానికి సంబంధించిన ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. ఇక వరంగల్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 1,893 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా.. అత్యధికంగా పాలకుర్తి నియోజకవర్గంలో 294 కేంద్రాలు, స్టేషన్‌ఘనపూర్ పరిధిలో 290 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో 1,783 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయగా ములుగులో అత్యధికంగా 209, మహబూబాబాద్‌లో 184 పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించనున్నారు. దివ్యాంగులు, గర్భిణులు సులువుగా పోలింగ్ కేంద్రాలకు చేరుకునేలా, ఓటరు ఫెలిసిటేషన్ సెంటర్, హెల్ప్ డెస్క్, సిగ్నేజ్, షెడ్, తగిన వెలుగు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే అభ్యర్థికి సంబంధించిన మొత్తం సమాచారాన్ని తెలుసుకునేందుకు వీలుగా 'నో యువర్ క్యాండిడేట్..' యాప్ ద్వారా తెలుసుకునే అవకాశం కల్పించారు. అలాగే ఎన్నికల్లో జరిగే అవకతవకలపై సీ విజిల్ యాప్ ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయవచ్చు.

ఎన్నికల ప్రక్రియ కొనసాగనుందిలా..

కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 18న గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. అదే రోజు నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 26వ తేదీన నామినేషన్ల పరిశీలన, 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. మే 13వ తేదీన రాష్ట్రంలోని అన్ని స్థానాలతో పాటు వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలకు పోలింగ్ జరుగుతుంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. ఇక వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి వరంగల్ కలెక్టర్, మహబూబాబాద్ స్థానానికి మహబూబాబాద్ కలెక్టర్ ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తారు. అభ్యర్థుల నామినేషన్లను కలెక్టరేట్లలోనే స్వీకరించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

'మానుకోట'లో పొలిటికల్ హీట్

మహబూబాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ ఎన్నికలకు నగారా మోగడంతో మహబూబాబాద్ (మానుకోట) పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పొలిటికల్ హీట్ మొదలైంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇప్పటికే ఖరారవడంతో వారు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. తమ అనుచరగణాన్ని కూడగట్టుకుని.. ప్రచార పర్వంలోకి దిగేతందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం.. మే 13న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ నాటికి దాదాపు 57 రోజుల వ్యవధి ఉండగా.. ఈ సమయాన్ని సక్రమంగా వినియోగించుకుని తమ సత్తా చాటాలని అభ్యర్థులు వ్యూహరచన చేసుకుంటున్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం..

మిగతా 7వ పేజీలో..

వరంగల్ అభ్యర్థులను తేల్చని కాంగ్రెస్, బీజేపీ

లోక్‌సభ ఎన్నికల నగారా మోగడంతో ఉమ్మడిజిల్లాలో రాజకీయం వేడెక్కుతోంది. ఇప్పటికే మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ తమ అభ్యర్థులను ఖరారు చేయడంతో వారు ప్రజాక్షేత్రంలోకి దిగారు. ఇక వరంగల్ లోక్‌సభ స్థానానికి బీఆర్ఎస్ తన అభ్యర్థిగా కడియం కావ్య పేరును ప్రకటించగా.. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులెవరే ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ క్రమంలో ఆయా పార్టీల కేడర్ అయోమయానికి గురవుతోంది. మే 13న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో అభ్యర్థుల ప్రకటన విషయంలో కాంగ్రెస్, బీజేపీ మరికొంత సమయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది. అయితే బీజేపీలోకి మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను ఆదివారం చేర్చుకుని, అభ్యర్థిగా ప్రకటిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఇక కాంగ్రెస్‌లోనే 50మందికి పైగా ఆశావహులు ఉండటంతో వారిలో ఎవరిని ఎంపిక చేస్తారనే ఉత్కంఠ ఆ పార్టీ కేడర్‌లో కనిపిస్తోంది.

వరంగల్‌లో 18,16,429మంది, మానుకోటలో 15,26,998 ఓటర్లు



వరంగల్ లోక్‌సభ పరిధిలో 7 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. గత నెల 8వ తేదీ వరకు నమోదైన మొత్తం ఓటర్లు 18,16,429మంది. వీరిలో మహిళలు 9,23,510మంది కాగా, పురుషులు 8,92,527 మంది ఉన్నారు. 392 మంది ఇతరులు ఉన్నారు. వరంగల్ ఎంపీ స్థానంలో పురుషుల కంటే మహిళలు 30,983 మంది అధికంగా ఉన్నారు. అలాగే మహబూబాబాద్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో మొత్తం 15,26,998 మంది ఓటర్లుండగా వీరిలో మహిళలు 7,81,339 మంది, పురుషులు 7,45,554 మంది, 105 మంది ఇతరులున్నారు. ఇక్కడ కూడా మహిళ ఓటర్లు 35,785 మంది అధికంగా ఉన్నారు. కాగా, వరంగల్ పార్లమెంట్ పరిధిలో 2019కంటే ఓటర్లు భారీగా పెరిగారు. 2019లో 15,78,335మంది ఉంటే ఈసారి 18,16,429మంది ఉన్నారు. ఈ ఐదేళ్లలో 2,38,094 మంది ఓటర్లు పెరిగారు. అలాగే మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలో 2019లో 13,36,286 మంది ఉంటే ఈసారి 15,26,998 ఓటర్లున్నారు. గత ఐదేళ్లలో 1,90,712మంది పెరిగారు. తుదిజాబితా నాటి ఈ సంఖ్య ఇంకా పెరుగుతుందని అంచనా.

వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధి ఓట్లు..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
స్టేషన్‌ఘనపూర్	1,24,659	1,27,948	01	2,52,608
పాలకుర్తి	1,26,256	1,28,533	13	2,54,802
పరకాల	1,08,156	1,14,105	02	2,22,263
వరంగల్ పశ్చిమ	1,38,594	1,43,095	14	2,81,703
వరంగల్ తూర్పు	1,24,707	1,31,428	339	2,56,474
వర్ధన్నపేట	1,33,524	1,38,514	17	2,72,055
భూపాలపల్లి	1,36,631	1,39,887	06	2,76,524
మొత్తం	8,92,527	9,23,510	392	18,16,429

మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధి ఓట్లు..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
డోర్నకల్	1,08,931	1,13,165	07	2,22,103
మహబూబాబాద్	1,26,290	1,31,449	47	2,57,786
నర్సంపేట	1,14,891	1,20,104	09	2,35,004
ములుగు	1,13,413	1,18,935	26	2,32,374
పినపాక	99,608	1,03,525	05	2,03,138
ఇల్లందు	1,09,632	1,14,818	04	2,24,454
భద్రాచలం	72,789	79,343	07	1,52,139
మొత్తం	7,45,554	7,81,339	105	15,26,998

ఐదేళ్లలో పెరిగిన ఓటర్లు..

పార్లమెంట్ స్థానం	2019	2024	పెరిగిన ఓట్లు
వరంగల్	15,78,335	18,16,429	2,38,094
మహబూబాబాద్	13,36,286	15,26,998	1,90,712

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

23న తిరుమలనాథ స్వామి వారి కల్యాణోత్సవం



ఆలయంలో కొలువైన తిరుమలనాథస్వామి

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, మార్చి 16: స్టేషన్ ఘన్‌పూర్ బస్టాండ్ వెనుక ఉన్న పురాతన శ్రీ తిరుమల నాథస్వామి దేవాలయంలో మార్చి 17 నుంచి 26 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. పరమ హంస పరివ్రాజకులు శ్రీరామచంద్ర జీయర్ స్వామి వారి మంగళాశాసనాలతో ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 23న ఉదయం 11 గంటలకు తిరుమల నాథ స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ నిర్వహణ కమిటీ చైర్మన్ కలకోట రంగాచారి, సభ్యులు యాద శ్రీనివాస్, ఎం.రవీందర్, ఎస్.ఆంజనేయులు, పూజారి రాము తెలిపారు. లయన్స్ క్లబ్, వికాస తరంగిణి వారిసౌజన్యంతో భక్తుల సౌకర్యార్థం విద్యుత్ దీపాలు, చలువ పందిళ్లు, బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ కల్చరల్, మార్చి 16: పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి నిర్వహించే పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 41 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించామని, పరీక్ష కేంద్రాల వద్ద పోలీసుల బందోబస్తు ఉంటుందని, పరీక్షల సమయంలో జిరాక్స్ కేంద్రాలు మూసివుంటాయని, అన్ని పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. ఈసారి జనగామ జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

డీఎస్సీ కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేట జిల్లా కేంద్రంలో డీఎస్సీ కోచింగ్ కోసం ఏర్పాటు చేసిన ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 3 నుంచి జూన్ 2 వరకు ఎస్సీ అభ్యర్థులకు శిక్షణ ఉంటుందన్నారు. అభ్యర్థులు డైట్ లేదా బీఈడీ, టెట్ ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 26 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మోదీ కుట్రలో భాగమే

కవిత అరెస్టు

- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న ప్రధాని
- మాట విననివారిపై అక్రమ కేసులు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- నియోజకవర్గకేంద్రాల్లో రాస్తారోకోలు

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 16: ప్రధాని నరేంద్రమోదీ చర్యలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా ఉన్నాయని, ఎమ్మెల్సీ కవిత అరెస్టు వెనక ఆయన కుట్ర ఉందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. కవిత అరెస్టును నిరసిస్తూ ఘన్‌పూర్‌లో జాతీయ రహదారిపై శనివారం రాస్తారోకో నిర్వహించారు. మోదీని టార్గెట్ చేస్తూ నినదించారు. సుమారు గంటపాటు రాస్తారోకో చేయడంతో రహదారికి రెండు వైపుల వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు కొందరు నాయకులను తీసుకెళ్లి పోలీసు వాహనాల్లో ఎక్కించినా ఫలితం లేకుండా పోయింది. ఏసీపీ భీమ్‌శర్మ కడియంతో మాట్లాడి రాస్తారోకో విరమింప చేశారు. అనంతరం ఘన్‌పూర్ గాంధీ చౌరస్తా వరకు కడియం నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బలంగా ఉన్న బీఆర్ఎస్‌ను మానసికంగా దెబ్బతీయాలనే లక్ష్యంతో లోకసభ ఎన్నికల ముందు మోదీ కుట్ర పన్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీలకు లోకసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు లేక బీఆర్ఎస్ నాయకులను కొనుగోలు చేస్తున్నాయన్నారు. బీజేపీ ప్రకటించిన 15మంది అభ్యర్థుల్లో సగం మంది బీఆర్ఎస్ నుంచి వెళ్లినవారే ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీలో కూడా బీఆర్ఎస్ నాయకులను చేర్చుకొని సీట్లు ఇచ్చే దుస్థితి ఉందన్నారు. ఇతర పార్టీల వారిని తీసుకొని టికెట్‌లు ఇవ్వడమే వారి బలహీనతకు నిదర్శనమన్నారు.

కాంగ్రెస్ పార్టీకి కాస్తంతనైనా బుద్ధి ఉంటే ఎండిపోతున్న పంటలకు సాగునీరు అందించాలని, కోతలు లేకుండా కరెంట్ సరఫరా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ప్రకటించిన విధంగా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, రైతుబంధును ఇచ్చి చిత్తశుద్ధి చాటుకోవాలని హితవుపలికారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎడవెల్లి కృష్ణారెడ్డి, బెలిదె వెంకన్న, రాపోలు మధుసూదన్ రెడ్డి, మారుజోడు రాంబాబు, తీగల కరుణాకర్, భూర్ల శంకర్, జనగాం యాదగిరి, జడ్పీటీసీలు బేబి-శ్రీనివాస్, చాడ సరిత, బొల్లం అజయ్, ఎంపీపీలు సరిత, రేఖ, ఎంపీటీసీలు రజాక్‌యాదవ్, గన్ను నర్సింహులు, ఉమా-సమ్మయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్‌లో రాస్తారోకోలో పాల్గొన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి



పాలకుర్తిలో ధర్నా చేస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

ఎమ్మెల్సీ కవిత అరెస్టు అక్రమం

పాలకుర్తి: మద్యం కేసులో ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడం అక్రమమని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పల మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ కవిత అరెస్టు వెనుక ప్రధానమంత్రి నరేంద్రమోదీ హస్తం ఉందన్నారు. నరేంద్రమోదీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం పోలీసులు వారిని అక్కడి నుంచి తరలించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగిరెడ్డి, మండల అధ్యక్షుడు నవీన్, బస్వ మల్లేషం, జడ్పీటీసీ శ్రీనివాసరావు, అందె యాకయ్య, జడ్పీకోఆప్షన్ సభ్యుడు ఎండి. మదార్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 81 సివిల్ కేసుల పరిష్కారం



కక్షిదారులకు రాజీ పత్రాలు అందిస్తున్న ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ

జనగామ కల్చరల్, మార్చి 16: జిల్లా కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పలు కేసులను పరిష్కరించారు. సంస్థ చైర్మన్ జస్టిస్ రవీంద్రశర్మ ప్రారంభించారు. మొత్తం ఐదు బెంచ్‌లు ఏర్పాటు చేయగా మొదటి బెంచ్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ, రెండో బెంచ్‌ను సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్, మూడో బెంచ్‌ను ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుచరిత, నాలుగో బెంచ్‌ను అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సందీప, ఐదో బెంచ్‌ను స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ డి.వెంకట్రామనర్సయ్య నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు, బీఎస్ఎన్ఎల్, సివిల్, మోటార్ ఆక్సిడెంట్లు, ఎలక్ట్రికల్, ట్రాఫిక్, ఫ్యామిలీ, ప్రిలిటిగేషన్ కేసులు పరిష్కరించారు. అనంతరం కక్షిదారులకు రాజీ పత్రాలు అందించారు. మొత్తంగా 81 సివిల్ కేసులు, 3169 ప్రిలిటిగేషన్ కేసులు పరిష్కరించినట్లు ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ తెలిపారు.

డీటీ పై దాడి ఘటనలో

ఆరుగురి అరెస్టు

జనగామ కల్చరల్, మార్చి 16: డిప్యూటీ తహసీల్దార్‌పై దాడి చేసిన ఘటనలో శనివారం ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు జనగామ సీఐ ఎల్.రఘుపతిరెడ్డి తెలిపారు. ఈ నెల 15న జనగామ డిప్యూటీ తహసిల్దార్ జగన్‌పై భూమి రిజిస్ట్రేషన్ విషయంలో కొందరు వ్యక్తులు దాడి చేసిన విషయం విదితమే.

కాగా ఈ కేసులో వడ్లకొండ గ్రామానికి చెందిన ముల్కల శ్రీనివాస్, ముల్కల రాజు, ముల్కల మల్లేష్, ముల్కల వెంకటేష్, ముల్కల నాగరాజు, ముల్కల తరుణ్‌ను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రపంచానికి నూతన ఆవిష్కరణలు అందించాలి

ఎస్సార్ వర్సిటీ స్నాతకోత్సవంలో న్యాక్ చైర్మన్ అనిల్ సహస్ర బుద్ధే

హసన్‌పర్తి, మార్చి 16 : యువ ఇంజనీర్లు ప్రపంచానికి నూతన ఆవిష్కరణలను అందించాలని ఎగ్జిక్యూటివ్ కమిటీ నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ చైర్మన్ అనిల్ సహస్ర బుద్ధే అన్నారు. హసన్‌పర్తి మండలం అనంతసాగర్ వద్దగల ఎస్సార్ యూనివర్సిటీలో శనివారం ప్రథమ స్నాతకోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువ ఇంజనీర్లు సాంకేతిక పరిజ్ఞానంతో సమస్యలను పరిష్కరించే వారిగా ఉండి, నూతన ఆవిష్కరణలకు తోడ్పడాలన్నారు. యూనివర్సిటీ కల్పించే సదుపాయాలతో అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. కృత్రిమ మేధస్సు, మెషిన్ లర్నింగ్, డ్రోన్స్, రోబోటిక్స్, క్వాంటం కంప్యూటింగ్ సాంకేతికతతో ప్రపంచం ముందుకు వెళుతుందన్నారు. భారతదేశం సైన్స్ అండ్ టెక్నాలజీలో మార్గదర్శిగా నిలిచిందన్నారు. అందుకు నిదర్శనం చంద్రయాన్, ఆదిత్య మిషన్, థోరియం రియాక్టర్లు, వందేభారత్ రైళ్లు నిదర్శనమన్నారు. ఎన్ఈటీఎఫ్, పీఎంకేవీవై, ఎన్ఎన్డీసీ, ఎన్ఎస్ఎం వంటివి ఏర్పాటు చేయడం ద్వారా సాంకేతిక నైపుణ్యాలు అందుతున్నాయని పేర్కొన్నారు. యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎనగందుల వరదారెడ్డి మాట్లాడుతూ.. 45ఏళ్లుగా విద్యారంగంలో సేవలందిస్తున్నట్లు తెలిపారు. 2002లో ఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలను స్థాపించి, ఎన్ఏఏసీ, ఎన్‌బీఏ, యూజీసీ అక్రిడియేషన్స్ పొంది, 2023లో జాతీయ స్థాయిలో 98వ స్థానం సాధించి, నూతన ఆవిష్కరణలతో జాతీయ స్థాయిలో అటల్ ర్యాంకింగ్‌లో ప్రథమ స్థానం పొందినట్లు పేర్కొన్నారు. సినీ గేయ రచయిత చంద్రబోస్ మాట్లాడుతూ.. ఆర్ఆర్ఆర్ చిత్రం ద్వారా ఆస్కార్ అవార్డు రావడం, ఎస్సార్ వర్సిటీ ద్వారా గౌరవ డాక్టరేట్ రావడం జీవితంలో మరిచిపోలేనివన్నారు. చదువు నేర్పుకున్న గురువుతోనే డాక్టరేట్ అందుకోవడం సంతోషదాయకమన్నారు. అనంతరం చంద్రబోస్‌కు గౌరవ డాక్టరేట్ పట్టాను, విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రో చాన్స్‌లర్ ఎనగందుల మధుకర్‌రెడ్డి, వైస్ చాన్స్‌లర్ దీపక్ గార్గ్, రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి, కన్వోకేషన్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ సీవీగురురావు, డీన్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనిల్ సహస్ర బుద్ధే

లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం

▸▸ తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాథే ▸▸ ఏసీబీ, హనుమకొండ రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రధాన న్యాయమూర్తి

వరంగల్ లీగల్, మార్చి 16 : లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం సాధ్యమవుతుందని, ఇందులో వరంగల్, హనుమకొండ జిల్లా కోర్టులు ముందున్నాయని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాథే ప్రశంసించారు. శనివారం వరంగల్, హనుమకొండ కోర్టుల సముదాయంలో కొత్తగా ఏర్పాటు చేసిన అవినీతి నిరోధక వరంగల్ ప్రత్యేక కోర్టు (ఏసీబీ), హనుమకొండ రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఈ-సేవా కేంద్రం, రికార్డుల డిజిటలైజేషన్ కేంద్రాన్ని జస్టిస్ అలోక్ అరాథే ప్రారంభించారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా మొత్తం 3,43,182 కేసులు పరిష్కారంకాగా, వరంగల్ కోర్టు పరిధిలో 4713, హనుమకొండ జిల్లా కోర్టు పరిధిలో 3,501 కేసులు పరిష్కారమయ్యాన్నారు. లోక్‌అదాలత్ ద్వారా ఈ రెండు కోర్టుల పరిధిలో అత్యధికంగా కేసులు పరిష్కారం కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. కేసుల సత్వర కృషి చేసినందుకు జ్యుడీషియల్ సిబ్బందిని ప్రధాన న్యాయమూర్తి అభినందించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు కలిసికట్టుగా కృషి చేసినందు వల్లనే ఇది సాధ్యమైందన్నారు.


హనుమకొండ రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాథే

న్యాయవ్యవస్థ అంకితభావంతో అర్థవంతమైన పాత్రపోషించడం ద్వారానే సమాజంలో వెలుగులను నింపగలుగుతామని జస్టిస్ అలోక్ అరాథే అన్నారు. కేసుల పరిష్కారంలో న్యాయమూర్తులు, న్యాయవాదుల పరస్పర సహకారం కీలకమైందన్నారు. ఉభయులు పరస్పర సహకారం, సమన్వయంతోనే కేసులు సత్వరం పరిష్కారం అవుతాయన్నారు. వరంగల్ కోర్టు సముదాయంలో శనివారం ప్రారంభమైన ఈ-సేవా కేంద్రం ఎంతో ఉపయుక్తమైందని అన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద తెలంగాణ రాష్ట్రంలో మొదటి సారి దీనిని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. దీని కొనసాగింపుగా ఈనెల 23న నల్లగొండ జిల్లాలో కూడా ఈ-సేవా కేంద్రం ఏర్పాటు చేయనున్నట్టు ఆయన తెలిపారు. ఈ-సేవా కేంద్రాన్ని న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవడం ద్వారా కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ-సేవా కేంద్రం ద్వారా హైకోర్టు వరకు రావలసిన అవసరం లేకుండా ఇక్కడి నుంచే కేసులను దాఖలు చేయడంతో పాటు ఆన్‌లైన్‌లో వాదనలు వినిపించే అవకాశం ఉందన్నారు. కోర్టు ప్రాంగణంలో కొత్తగా అందుబాటులోకి తీసుకువచ్చిన డిజిటల్ కేంద్రం సౌకర్యాన్ని ప్రస్తావిస్తూ కేసులకు సంబంధించిన దస్తావేజులు కాలక్రమంలో దెబ్బతింటున్న దృష్ట్యా వాటిని శాశ్వతంగా భద్రపరిచేందుకు డిజిటైజేషన్ ఎంతో ఉపయోగపడుతుందని, ఈ సౌకర్యం వరంగల్ జిల్లా కోర్టు సముదాయంలో అందుబాటులోకి వచ్చినందుకు హర్షం వ్యక్తం చేశారు. దీనిని న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని జస్టిస్ అలోక్ అరాథే కోరారు. బార్ అసోసియేషన్ల ప్రతినిధులు తన దృష్టికి తెచ్చిన జిల్లా కోర్టు సముదాయంలోని సమస్యల ను, డిమాండ్లను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

జిల్లా పోర్టు పోలియో జడ్జి, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ జె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. జూనియర్ న్యాయవాదులకు వర్క్‌షాపులను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిమెంట్ల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. హైకోర్టు జడ్జి జస్టిస్ నామవరపు రాజేశ్వర్ రావు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఐదుకోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, హనుమకొండ, వరంగల్ జిల్లాల వ్యాప్తంగా కూడా 30వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు చిత్తశుద్ధితో కేసుల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. వరంగల్ జిల్లాతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. హైకోర్టు మరో జడ్జి జస్టిస్ టి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. కోర్టు సముదాయంలో కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఈ-సేవా కేంద్రం ద్వారా న్యాయవాదులు తమ కేసుల దస్తావేజులను ఉచితంగా స్కాన్ చేసుకోవచ్చునని తెలిపారు.

తొలుత హనుమకొండ జిల్లా ప్రధాన జడ్జి ఎం.క్రిష్ణమూర్తి స్వాగతోపన్యాసం చేశారు. వరంగల్, హనుమకొండ కోర్టు సముదాయం ప్రాముఖ్యత, ఓరుగల్లు జిల్లా చారిత్రక నేపథ్యాన్ని వివరించారు. వరంగల్ జిల్లా జడ్జి కోక రాధాదేవి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. తొలుత జస్టిస్ అరాథే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ల అధ్యక్షులు వై.శ్యాంసుందర్ రెడ్డి, ఈ.అనంద్ మోహన్, రాష్ట్ర బార్‌కౌన్సిల్ సభ్యులు భైరపాక జయాకర్, దుస్సా జనార్దన్, హైకోర్టు రిజిస్ట్రార్ నందికొండ నర్సింగరావు, ఉభయ జిల్లాల అదనపు జిల్లా జడ్జిలు, సీనియర్ సివిల్ జడ్జిలు, జూనియర్ సివిల్ జడ్జిలు, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆహూతులతో కోర్టు ప్రాంగణం కిటకిటలాడింది. కార్యక్రమం ఆద్యంతం అహ్లాదకర వాతావరణంలో జరిగింది.

అంతకుముందు పది కోర్టుల భవన సముదాయం ముందుగల కాకతీయ కళాతోరణం ఎదుట జిల్లా న్యాయమూర్తులు, అదనపు న్యాయమూర్తులు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాథేతో కలిసి గ్రూప్ ఫొటోలు దిగారు. సమావేశం అనంతరం బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ముఖ్య అతిథులను సత్కరించారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరాథే శనివారం రాత్రి ఇక్కడే బస చేస్తారు. ఆదివారం హనుమకొండలోని వేయి స్తంభాలగుడి, భద్రకాళి దేవాలయం, ములుగులోని రామప్ప గుడిని సందర్శిస్తారు. కాగా, ఆదివారం నర్సంపేటలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును జిల్లా పోర్టు పోలియో జడ్జి జిస్టస్ కె.లక్ష్మణ్ ప్రారంభిస్తారు.

లోక్ అదాలత్‌లో 8,214 కేసుల పరిష్కారం

హనుమకొండ జిల్లాలో 3,501, వరంగల్ జిల్లాలో 4,713

వరంగల్ లీగల్, మార్చి 16 : జాతీయ రాష్ట్ర న్యాయ సేవా సంస్థల ఆదేశాల మేరకు శనివారం జిల్లా కోర్టు సముదాయంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 8,214 కేసులను పరిష్కరించినట్టు వరంగల్, హనుమకొండ జిల్లా జడ్జిలు కె.రాధాదేవి, ఎం.క్రిష్ణమూర్తి తెలిపారు. వరంగల్ జిల్లాలో తొమ్మిది బెంచీలు ఏర్పాటుచేసి 49 సివిల్ కేసులు, 28 రోడ్డు ప్రమాద బీమా కేసులు పరిష్కరించి బాధితులకు రూ.కోటి 40లక్షల 92వేల 176 నష్టపరిహారం చెల్లించారు. 4,164 క్రిమినల్ కేసులు, 5 ప్రీలిటిగేషన్ కేసులు, 13 బీఎస్ఎన్ఎల్ కేసులు పరిష్కరించినట్టు తెలిపారు. హనుమకొండ జిల్లా పరిధిలో 39 సివిల్ కేసులు, 24 మోటారు ప్రమాద బీమా కేసులు పరిష్కరించి బాధితులకు రూ.1,13,75,000 నష్టపరిహారం అందించినట్టు న్యాయమూర్తులు తెలిపారు. 3455 క్రిమినల్ కేసులు, 7 బీఎస్ఎన్ఎల్ కేసులు కూడా పరిష్కరించారు.

అంతకుముందు ఉదయం 10.30 గంటలకు న్యాయసేవా సంస్థ భవన్‌లో లోక్ అదాలత్ కార్యక్రమాన్ని హనుమకొండ, వరంగల్ జిల్లా జడ్జిలు ప్రారంభించారు. హనుమకొండ జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి ఉపేందర్ రావు, వరంగల్ జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి సాయికుమార్, హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్, అదనపు జిల్లా జడ్జిలు, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ల అధ్యక్షులు ఎలుకుర్తి ఆనంద్ మోహన్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, న్యాయవాదులు, వివిధ బ్యాంకు ఇన్సూరెన్స్ అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.


లోక్‌అదాలత్‌ను ప్రారంభిస్తున్న వరంగల్ జిల్లా జడ్జి రాధాదేవి

'మానుకోట'లో పొలిటికల్ హీట్

(5వ పేజీ తరువాయి)

ములుగు మొదలుకుని నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు, పినపాక, భద్రాచలం వరకు మొత్తం ఏడు ఏజెన్సీ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉంది. అయితే ప్రచార వ్యవధికాలానికి ఒకట్రెండురోజుల ముందే ఆయా నియోజకవర్గాలను చుట్టి రావడంతో పాటు అన్ని వర్గాల ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు చేసేందుకు నేతలు సమాయత్తమవుతున్నారు. తమ పార్టీల అగ్రనేతల సభలు, రోడ్‌షోల నిర్వహణకు కసరత్తు చేసుకుంటున్నారు. ముందస్తుగానే అసెంబ్లీ నియోజవర్గాల వారీగా పార్లమెంటరీ ఎన్నికల సన్నాహక సమావేశాలను నిర్వహిస్తున్నారు. తొలుత పార్టీ టికెట్ ఖరారు చేసుకున్న సిట్టింగ్ బీఆర్ఎస్ ఎంపీ మాలోతు కవిత తన తండ్రి, డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ సొంత నియోజకవర్గంలోని మరిపెడ నుంచి ప్రచారం ఆరంభించారు. కాంగ్రెస్ రెండవ జాబితాలో చోటు దక్కించుకున్న కేంద్రమాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ రెండ్రోజుల కిందట మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధి భద్రాచలంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమానికి హాజరై తన ప్రచార పర్వానికి అక్కడి నుంచే శ్రీకారం చుట్టారు. తాజాగా బీజేపీ అభ్యర్థి, మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్ నర్సంపేట నియోజకవర్గం నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టి గూడూరు మీదుగా డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాల్లో శనివారం పర్యటించారు. అయితే ఈ ముగ్గురు పార్లమెంట్ నియోజకవర్గానికి పాత ముఖాలే కావడంతో తమతమ హయాంలో చేసిన అభివృద్ధిని చెప్పుకోవడంతో పాటు పరిచయాలతో ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

కోడ్‌తో సామాన్యులకు సంకటమే..

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతోనే ఎన్నికల కోడ్ శనివారం నుంచే అమల్లోకి రావడం, సుమారు రెండునెలల పాటు ఈ కోడ్ అమల్లో ఉండనుండటంతో సామాన్యులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలున్నాయి. ఎవరైనా రూ.50వేల కంటే ఎక్కువ నగదుతో వెళ్లాల్సి వస్తే వాటికి సంబంధించిన సరైన ఆధారాలు చూపాలి. లేదంటే అధికారులు ఆ నగదును సీజ్ చేస్తారు. అయితే ప్రస్తుతం వివాహ శుభకార్యాల సమయం కావడం, ముఖ్యంగా ఏప్రిల్ 26 వరకు ఎక్కువ ముహూర్తాలు ఉండడంతో పెళ్లిళ్లు, ఇతరత్రా శుభకార్యాలకు అవసరమైన బంగారం, దుస్తులు, ఇతర వస్తువులు ఖరీదు చేసేందుకు వధూవరుల బంధువర్గాలు ఇతర ప్రాంతాలకు వెళుతుంటారు. ఈ క్రమంలో అధిక మొత్తంలో నగదును తీసుకువెళ్లాల్సి ఉంటుంది. నగదు తీసుకువెళ్లకుండా ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేసే అవకాశాలున్నప్పటికీ ఆన్‌లైన్ విధానంలో చెల్లించే వాటి దుకాణాల వారు ట్రాన్సాక్షన్ చార్జీల పేరుతో వసూలు చేస్తుండటంతో చాలా మంది డబ్బు రూపంలోనే ఇచ్చేందుకు ఆసక్తి చూపుతుంటారు. అలాగే ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన వారికి డిజిటల్ చెల్లింపులపై అంతగా అవగాహన లేని వారు డబ్బును తీసుకెళుతుంటారు. అలాంటి వారికి ఎన్నికల కోడ్ తనిఖీలు కొంత సంకటంగా మారే అవకాశాలున్నాయి.

అధునాతన పద్ధతిలో

గర్భస్థ శిశువు తొలగింపు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, మార్చి 16 : ఓ తల్లి గర్భంలో ముగ్గురు శిశువులు ఒకే అమ్నిమాటిక్ పొరతో కప్పబడి ఉండగా అత్యంత అధునాతన పద్ధతిలో ఒక శిశువును తొలగించినట్లు హనుమకొండలోని ఫీటల్ మెడిసిన్ సెంటర్ వైద్యురాలు డాక్టర్ శిరీష శనివారం తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష మాట్లాడుతూ.. వరంగల్‌లో మొట్టమొదటి సారిగా ఈవిధానంలో చికిత్స అందించామన్నారు. వరంగల్ శివనగర్ ప్రాంతానికి చెందిన 15 వారాల గర్భిణి గుగులోతు సంతోష (29) చికిత్స నిమిత్తం తమ వద్దకు వచ్చినట్లు తెలిపారు. ఈమె గర్భంలో ఒకే పొర కింద ముగ్గురు శిశువులున్నట్లు గుర్తించి పొటాషియం క్లోరైడ్ ఇంజనక్షన్‌తో ఒక శిశువును తొలగించే అవకాశం ఉన్నప్పటికీ అది సాధ్యం కాలేదన్నారు. కొన్ని ఇంజక్షన్లు ఇవ్వడం వల్ల ముగ్గురు శిశువులు చనిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ కష్టమైన కేసులో ముంబై నుంచి ఓ ప్రత్యేకమైన లేజర్ మిషన్ తెప్పించి క్లిష్టమైన అరుదైన శస్త్రచికిత్సను హనుమకొండలో నిర్వహించామన్నారు. హైదరాబాద్ నగరంలో ఇలాంటి కేసులు ఒకటి రెండు మాత్రమే జరిగాయని తెలిపారు. హైదరాబాద్ నగరంలో 75వేల నుంచి రూ.90వేల వరకు ఖర్చు కానుండగా, హనుమకొండలో మాత్రం రూ.35వేలకే చికిత్స అందించామని తెలిపారు. ప్రస్తుతం గర్భిణితో పాటు ఇద్దరు శిశువులు క్షేమంగా ఉన్నట్లు ఫీటల్ మెడిసిన్ వైద్యురాలు డాక్టర్ శిరీష వెల్లడించారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

జిల్లా ఎన్నికల అధికారి షేక్ రిజ్వాన్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి షేక్ రిజ్వాన్ బాషా

జనగామ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ప్రతీ ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించిన వాల్ రైటింగులు, పోస్టర్లను తొలగిస్తామన్నారు. 24 గంటల్లోగా ప్రభుత్వ కార్యాలయాల్లోని, 48 గంటల్లోగా రాజకీయ పార్టీల పోస్టర్లు, రాతలను, 72 గంటల్లో ప్రైవేటు బిల్డింగులపై ఉన్న రాతలను తొలిగిస్తామని చెప్పారు. ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు చేపట్టవద్దని సూచించారు. సభలు, సమావేశాల నిర్వహణకు ఆయా నియోజకవర్గాల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల(ఏఆర్వో) అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. పాలకుర్తి ఏఆర్వోగా అదనపు కలెక్టర్(రెవెన్యూ), జనగామ ఏఆర్వోగా జనగామ ఆర్డీవో, స్టేషన్‌ఘన్‌పూర్ ఏఆర్వోగా స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో వ్యవహరిస్తారన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల స్వీకరణ, సమాచారం కోసం జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాలు వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం, జనగామ నియోజకవర్గం భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోకి వస్తాయన్నారు. ఈ మూడు నియోజకవర్గాల్లో తక్షణమే నిఘా బృందాలు అందుబాటులోకి వస్తాయన్నారు. జనగామ నియోజకవర్గంలో 25, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో 44, పాలకుర్తి నియోజకవర్గంలో 49 పోలింగ్ స్టేషన్లను సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లుగా గుర్తించామన్నారు. ఎన్నికల నియమావళిని ఎవరైనా ఉల్లంఘిస్తే ఆయా నియోజకవర్గాల అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లకు గానీ, సీ విజిల్ యాప్ ద్వారా గానీ ఫిర్యాదు చేయాలని సూచించారు. నగదు రవాణాను అరికట్టేందుకు గానూ జిల్లాలో మూడు చోట్ల పోలీస్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. సమావేశంలో జిల్లా డిప్యూటీ ఎన్నికల అధికారి పింకేశ్‌కుమార్, ఏఆర్వోలు రోహిత్‌సింగ్, డీఎస్ వెంకన్న, కొమురయ్య పాల్గొన్నారు.

మూడు నియోజకవర్గాల్లో 7,49,108 మంది ఓటర్లు

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలను జిల్లా ఎన్నికల అధికారి షేక్ రిజ్వాన్ బాషా ప్రకటించారు. మూడు నియోజకవర్గాలు కలిపి 7,49,108 మంది ఓటర్లు ఉండగా ఇందులో ఎక్కువ శాతం మహిళల ఓట్లు ఉన్నాయి. పురుష ఓటర్లు 3,69,725 ఉండగా, మహిళలు 3,79,359, థర్డ్ జండర్ 24 ఓటర్లు ఉన్నారు. మూడు నియోజకవర్గాల్లో అత్యధికంగా పాలకుర్తి నియోజకవర్గంలో ఎక్కువ మంది ఓటర్లు ఉన్నారని ప్రకటనలో పేర్కొన్నారు.

నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	కేంద్రాలు	పురుషులు	మహిళలు	థర్డ్‌జండర్	మొత్తం
జనగామ	277	119004	122581	9	241594
స్టేషన్‌ఘన్‌పూర్	290	124769	128282	2	253053
పాలకుర్తి	294	125952	128496	13	254461
మొత్తం	861	369725	379359	24	749108

నియోజకవర్గాల వారీగా 80 ప్లస్, దివ్యాంగ ఓటర్లు

నియోజకవర్గం	80 ప్లస్	దివ్యాంగులు
జనగామ	4166	5338
స్టేషన్‌ఘన్‌పూర్	4757	5613
పాలకుర్తి	4980	5572
మొత్తం	13903	16523

కవిత అరెస్టుపై నిరసనలు



తరిగొప్పులలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



జనగామలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున

తరిగొప్పుల, మార్చి 16: ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు నిరసనగా ఆ పార్టీ రాష్ట్రకమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకురాలు రాస్తారోకో నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు పింగిళి జగన్‌మోహన్ రెడ్డి, అధికార ప్రతినిధి చిలువేరు లింగం ఆధ్వర్యంలో నాయకులు హుస్నాబాద్ - జనగామ రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్షాలపట్ల అణచివేత ధోరణిని ప్రదర్శిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి పోషయ్య గౌడ్, రాజేశ్వర్ గౌడ్, సుంకరి రాజయ్య, అంకం రాజారాం, నేతుల సత్తయ్య, సుంకరి రవి, చెన్నూరి సంజీవ, సిద్దిని మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌పై బీజేపీది కుట్రపూరిత వైఖరి..

జనగామ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీపై బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని జనగామ మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున విమర్శించారు. జనగామలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్‌ను అయోమయంలో పడేయాలన్న ఉద్దేశంతోనే కవితను అరెస్ట్ చేశారని అన్నారు. మోదీ ఎన్ని కుట్రలు చేసినా లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ మెజారిటీ సీట్లను కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు బాల్దె సిద్ధిలింగం, గాడిపల్లి ప్రేమలతారెడ్డి, తాళ్ల సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

బచ్చన్నపేట: ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెట్టాలనే దురుద్దేశంతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి కుట్ర చేసి ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేశాయని పీఏసీఎస్ చైర్మన్ పులిగిళ్ల పూర్ణచందర్, పార్టీ మండల అధ్యక్షులు బోడిగం చంద్రారెడ్డి ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ రెండేళ్ల పాటు కేసును సాగదీసి, ఎన్నికల ముందు అరెస్ట్ చేయటంలో ఉద్దేశాన్ని తెలంగాణా ప్రజలు అర్థం చేసుకున్నారని, ఇందుకు పార్టీలు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళా మండల అధ్యక్షురాలు మద్దికుంట రాధ, పట్టణ అధ్యక్షులు గంధమాల నరేందర్, యూత్ అధ్యక్షుడు వడ్డేపల్లి ఉపేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, కనయ్యగౌడ్, ఎండీ షబ్బీర్, కొప్పురపు శ్రీనివాస్‌రెడ్డి, భానుచందర్, గోపి, జిల్లా సందీప్ తదితరులు పాల్గొన్నారు.

గోడలపై రాతలు.. ఫ్లెక్సీలకు బైబై

- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు బ్రేక్
- నేతల విగ్రహాలకు ముసుగులు

జఫర్‌గడ్, మార్చి 16: తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటనతో శనివారం నుంచే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చింది. దీంతో ఆయా రాజకీయ పార్టీలు, ఆయా అభ్యర్థులు, ప్రభుత్వ శాఖలు, అధికారులు ఇలా ఎవరికి వారు స్వీయ నిబద్ధతతో అనుసరించాల్సిన నియమావళిని కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించింది. అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు బ్రేక్ పడింది. ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలకు సంబంధించిన ప్రచార పోస్టర్లు, ఫ్లెక్సీలు, గోడలపై రాతలు, బోర్డులను తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో ఉన్న రాజకీయ పక్షాల పోస్టర్లు, ప్రచార వాల్‌రైటింగ్, ఫ్లెక్సీలను తొలగింపు ప్రక్రియ ప్రారంభమైంది. నిబంధనలు అమల్లోకి వచ్చిన తరువాత ఎవరైనా మళ్లీ ఫ్లెక్సీలు పెట్టి, గోడలపై రాతలు రాస్తే యంత్రాంగం చట్ట ప్రకారం చర్యలు తీసుకోనుంది. శనివారం సాయంత్రం జఫర్‌గడ్‌లో తహసీల్దార్, ఎంపీడీవో నేతృత్వంలో పలు చోట్ల ఉన్న రాజకీయ పక్షాల ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్ల జీపీ సిబ్బందిచే తొలగించడంతో పాటు వాల్‌రైటింగ్‌ను చెరిపేసి సున్నం వేయించే ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ సుమన్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో తొలగింపు ప్రక్రియను చేపట్టినట్లు తెలిపారు. ఎన్నికల నియమనిబంధనలను అన్ని రాజకీయ పక్షాలు పాటించి ఎన్నికల సక్రమ నిర్వహణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఐ అనిల్‌కుమార్, కార్యదర్శి బోనగిరి రాజేశ్వర్‌రావు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇవి పాటించాల్సిందే...

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున రాజకీయ పక్షాలు సమస్యలపై ధర్నాలు, ఆందోళనలు, పికెటింగ్‌లు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు వంటివి చేయకూడదు.

- లౌడ్ స్పీకర్ల వినియోగానికి ప్రత్యేకంగా అనుమతి తీసుకోవాలి.
- ప్రార్థనా మందిరాల దగ్గర ప్రచారం చేయకూడదు.
- ప్రభుత్వ ఉద్యోగులు పార్టీల ప్రచారంలో పాల్గొనరాదు.
- ప్రభుత్వ వేతనం పొందే కళాకారులు పార్టీలకు దూరంగా ఉండాలి.
- రాత్రి 10 గంటల తరువాత ప్రచారం నిషేధం.
- ప్రైవేట్ స్థలాల్లో ప్రచారానికి ఆయా ప్రాంతాల పురపాలక, నగరపాలక, పంచాయతీ కార్యాలయాలు, ఇంటి యజమాని అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది.



జఫర్‌గడ్‌లో నాయకుల ఫ్లెక్సీలను తొలగిస్తున్న సిబ్బంది

విద్యార్థుల శాస్త్ర సాంకేతిక పరిశోధన అమోఘం: డీఈవో



విద్యార్థుల ప్రదర్శనను తిలకిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

జనగామ కల్చరల్, మార్చి 16: విద్యార్థులు ఎంచుకున్న శాస్త్ర సాంకేతిక పరిశోధనాంశాలు ఎంతో అబ్బురపరిచాయని డీఈవో కె.రాము అన్నారు. జిల్లా కేంద్రంలోని గీతాంజలి హైస్కూల్‌లో శనివారం 'గ్రాండ్ ఎడ్యుకేషనల్ ఫెస్ట్' ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి డీఈవో కె.రాము, జీసీడీవో గౌసియాబేగం ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులు రూపొందించిన సైన్స్ పరికరాలను పరిశీలించి ప్రశంసించారు. మల్టీ పవర్ హౌజ్, స్మార్ట్ స్ట్రీట్ లైట్స్, హోమ్ ఆటోమేషన్, వేపాకుతో నీటి శుద్ధీకరణ, ప్లాస్టిక్ వేస్ట్ బాటిల్స్‌తో నిర్మాణ పనులు, మ్యాథ్స్ ఎక్స్‌పో, థియేటర్ షో, ఫుడ్ వరల్డ్, నాచురల్, మ్యాన్ మేడ్ డిజాస్టర్స్ ప్రదర్శన విద్యార్థుల సృజనాత్మకతను చాటాయి. జీసీడీవో గౌసియాబేగం మాట్లాడుతూ ఈ వైజ్ఞానిక ప్రదర్శనను మరింత స్ఫూర్తిగా తీసుకొని శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం పట్ల ఆసక్తిని పెంపొందించుకొని మరిన్ని గొప్ప ఆవిష్కరణలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మెన్ ప్రసాదరావు, సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు వినయ్‌కుమార్, డాక్టర్ వివేకానందరావు, ప్రిన్సిపాల్ శిల్ప, వికాస్ ఫార్మసి కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్ ఎగ్జిబిషన్

జనగామ కల్చరల్: భారత పర్యావరణ మంత్రిత్వ శాఖ చొరవతో తెలంగాణ స్టేట్ నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో 'బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్ ఎగ్జిబిషన్' ఘనంగా జరిగింది. శనివారం జిల్లా కేంద్రంలోని ధర్మకంచ జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి 58 పాఠశాలల నుంచి ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఎన్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ గౌసియాబేగం అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డీఈవో కె.రాము ముఖ్య అతిథిగా, ఎన్‌జీసీ స్టేట్ ప్రాజెక్టు అధికారి విద్యాసాగర్, జ్యూరీ కమిటీ మెంబర్ సాయిశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఉపయోగించిన తరువాత పడవేసే వ్యర్థాలతో చక్కటి కళాఖండాలను విద్యార్థులు తయారు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బాలబాలికలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో నర్మెట కేజీబీవీ విద్యార్థులు ప్రథమ బహుమతి, ఇటికాలపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ద్వితీయ, లింగాలఘణపురం కేజీబీవీ విద్యార్థులు తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. పాల్గొన్నవారందరికీ ఎన్‌జీసీ ఆధ్వర్యంలో ప్రశంసాపత్రాలు అందించారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీఈవో రాము తదితరులు

పేదింటి ఆడపడుచు వివాహానికి ఆర్థిక సహాయం

తరిగొప్పుల, మార్చి 16: మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన పల్లె మహాలక్ష్మి సంతోష్‌లు నిరుపేదలు కావడంతో వారి కుమార్తె సౌమ్య వివాహానికి శనివారం పలువురు నాయకులు, సామాజికవేత్తలు ఆర్థిక సహాయం అందజేశారు. స్థానిక ఆంధ్రజ్యోతి విలేఖరి అల్లిబిల్లి ప్రసాద్ కుమార్ రూ. 5వేలు, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఎడెల్లి శ్రీనివాస్ రెడ్డి రూ.3వేలు, వాస్విక్ ఫౌండేషన్ సభ్యుడు ఏదునూరి రాజయ్య రూ.15వేలు, నర్మెట మండల కేంద్రానికి చెందిన ఏనుగుల వెలంగిని రూ.3 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు ఎనుగల సమ్మయ్య, బెల్లం రాజు, గుడిపాటి కృష్ణకుమార్, తాడెం పోడి, బెల్లం కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 16: మండలంలోని నెమలిగొండ గ్రామంలో రూ.10లక్షల నిధులతో చేపట్టిన మహిళ కమ్యూనిటీ భవనం నిర్మాణానికి మహిళ సంఘాల సభ్యులతో కలిసి ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర కమిటీ సభ్యుడు పురమాని రజాక్‌యాదవ్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో మహిళ భవనానికి రూ 10లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో చైతన్యం కావలసిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా రూ.5లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాంచందర్, మహిళ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కొడకండ్ల, మార్చి 16 : మండలంలోని నర్సింగాపురం గ్రామంలో సీసీ రోడ్డు పనుల ను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు డి.సురేష్‌నాయక్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్.సోమనర్సయ్య, ఎం.రవీందర్, భిక్షపతి, వలభోజు రమేశ్, జగన్‌రెడ్డి, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

ముత్తారంలో హైమాస్ట్ లైట్లు..

పాలకుర్తి: మండలంలోని ముత్తారం, చెన్నూరు గ్రామాల్లో జడ్పీ నిధుల నుంచి మంజూరైన నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను శనివారం జడ్పీటీసీ పున్నూరి శ్రీనివాసరావు, ఎంపీపీ నాగిరెడ్డితో కలసి జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మదార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.1లక్ష నిధులతో గ్రామంలో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు 10 లైట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపేందర్, మురళీధర్‌రావు, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



నరేష్ (ఫైల్)

దేవరుప్పుల, మార్చి 16: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడెంలో ఓ యువకుడు శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు పులిపంపుల నరేష్(32) కొంతకాలంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడని, ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం: కొమ్మూరి



బొత్తలపర్రెలో భూమి పూజ చేస్తున్న కొమ్మూరి ప్రతాప్ రెడ్డి

తరిగొప్పుల, మార్చి 16: ఎల్లవేళలా ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రం శివారు కనీలకుంట్ల, బొంతగట్టు నాగారం, అబ్దుల్‌నాగారం గ్రామాలలో శనివారం ఆయన పర్యటించి పలు అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు గంగం నర్సింహారెడ్డి, మండలాధ్యక్షుడు వగలబోయిన యాదగిరి, ఎంపీటీసీ అర్జుల మధుసూదన్ రెడ్డి, నాయకులు పండుగ కనుయ్య, గోరంతల వీరన్న, పలుచని సుధాకర్, ఎడెల్లి శ్రావణ్ రెడ్డి, రంజిత్ రెడ్డి పాల్గొన్నారు.

కొమ్మూరి కృషితో చెరువుల్లోకి నీళ్లు..

బచ్చన్నపేట: డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కృషితో చెరువుల్లోకి నీళ్లు నింపే కార్యక్రమం జరుగుతోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి అన్నారు. గోదావరి జలాలు బొమ్మకూరు నుంచి కేశిరెడ్డిపల్లికి చేరుకున్న సందర్భంగా గ్రామంలో మాట్లాడుతూ పంటలు ఎండిపోకూడదనే ప్రయత్నంలో భాగంగానే అధికారులతో కొమ్మూరి మాట్లాడటం జరిగిందన్నారు. తపాస్‌పల్లి పైప్‌లైన్ వెంట ఆయా గ్రామాల రైతులు చెరువుల్లోకి నీరు వదులుతున్నారన్నారు. బీఆర్ఎస్ చేసిన తప్పిదం వల్లే ప్రాజెక్టుల నుంచి నీళ్లు వచ్చే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో గాలి కృష్ణ, పిన్నింటి నారాయణరెడ్డి, ఎండీ మసూద్, నిమ్మ కరుణాకర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, అల్వాల ఎల్లయ్య, మహేందర్, యాదగిరి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'పద్మశాలీ కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం'

జనగామ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పద్మశాలీ కార్పొరేషన్ ఏర్పాటు నిర్ణయం హర్షణీయమని తెలంగాణ పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల బాలరాజు, పోపా అధ్యక్షుడు దోర్నాల వెంకటేశ్వర్లు, జిల్లా పద్మశాలీ సెల్ అధ్యక్షుడు సామల పరమేశ్వర్ అన్నారు. కార్పొరేషన్ ఏర్పాటును స్వాగతిస్తూ జనగామ చౌరస్తాలో పద్మశాలీ సంఘం, పోపా ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పద్మశాలీల కోసం మొట్టమొదటి సారిగా కార్పొరేషన్ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. పద్మశాలీలంతా సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటామని తెలిపారు. కార్పొరేషన్ ఏర్పాటుతో పద్మశాలీల జీవితాల్లో వెలుగులు నిండుతాయన్నారు. కార్యక్రమంలో పోపా అధికార ప్రతినిధి పిట్టల సతీశ్, నాయకులు ఏల జనార్దన్, కాముని శ్రీనివాస్‌బాబు, దోర్నాల కుమార్, ఎల్లయ్య, ఆంజనేయులు, రాందయాకర్, మచ్చ బాలనర్సయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



పాలకుర్తిలో మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

పాలకుర్తి, మార్చి 16 : ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన అవసరం అని పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఉన్నత శ్రేణి ఆస్పత్రిలో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం, ప్రగతి వెల్ఫేర్ సొసైటీ సహకారంతో స్పర్శ క్యాన్సర్ కేర్ ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. గర్భసంచి, నోటి, రొమ్ము క్యాన్సర్‌లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ నేడు సమాజంలో క్యాన్సర్ వ్యాధి విస్తరిస్తోందని, దాని పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ ప్రాంతంలోని ప్రజలకు అండగా తాను ఉంటానని, క్యాన్సర్ పట్ల ఎవరు భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. గతంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామని, ప్రస్తుతం వాటిని కొనసాగిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ హరీశ్‌రాజ్, డాక్టర్ రవిరాథోడ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

బుగులోని వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

చిలుపూర్, మార్చి 16: మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్ట బుగులోని వెంకన్న ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం తొలి రోజు కార్యక్రమంలో భాగంగా చేపట్టిన తొళక్కం పూజా కార్యక్రమానికి దేవస్థానం చైర్మన్ మామిడాల యాదవరెడ్డి, ఈవో లక్ష్మిప్రసన్న హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, కృష్ణమాచార్యులు, రంగాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ యాదవరెడ్డి, ఈవో లక్ష్మిప్రసన్న మాట్లాడుతూ, నేడు (ఆదివారం) ద్రవిడవేద ప్రబంధ పారాయణం, పరమపదోత్సవం, 18న విశ్వక్సేన పూజ, 19న యాగశాల ప్రవేశం, 20న నిత్యనిధి హోమం, భేరిపూజ, ఎదుర్కోళ్ళతో పాటు, 22న స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని, భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు జక్కుల రాజశేఖర్, గాజుల రజని, గణేశ్, నారాయణరెడ్డి, మధు, బాలరాజు, పుట్ట కిరణ్‌రెడ్డి, మల్లేషం, సంగోజు మోహన్, సత్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్ ఆడెపు రమేష్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలను బలోపేతం చేయాలి

టీజీసీటీఏ ప్రధాన కార్యదర్శి బ్రిజేశ్

జనగామ కల్చరల్, మార్చి 16: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను బలోపేతం చేయాలని తెలంగాణ గవర్నమెంట్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బ్రిజేశ్ అన్నారు. శనివారం జనగామ జిల్లా కేంద్రం లోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించి మాట్లాడారు. కళాశాలలు బలోపేతం కావాలంటే విద్యార్థుల సంఖ్య పెరగాలని, విద్యార్థులకు అధ్యాపకులు దిక్సూచిలాగా ఉండాలని అన్నారు. విద్యార్థుల అభివృద్దే మన మనుగడ అన్నారు. అధ్యాపకులు సమస్యలు లేకుండా పని చేయగలిగితేనే అది సాధ్యమవుతుందని, అందుకు తన వంతు కృషి చేస్తానని, గెస్టు, కాంట్రాక్ట్, ప్రమోటీ, డైరెక్ట్ రిక్రూటీ అనే తేడా లేకుండా అందరి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నర్సయ్య, సిబ్బంది ఆయనను పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఏవో సులేమాన్, శ్రీనివాస్ గౌడ్, రవిప్రసాద్, రాజేష్‌కుమార్, పప్పుల శైలజ, గణేష్, సంధ్య, మధు, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో గుడిసెలు

అడ్డుకున్న పోలీసులు, సీపీఎం నాయకుల అరెస్ట్

బచ్చన్నపేట, మార్చి 16: పేదలకు ఇళ్లస్థలాలను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం చిన్నరామన్‌చర్ల రెవెన్యూ శివారు గోపాల్‌నగర్ గ్రామ సమీపంలో పేదలు సీపీఎం ఆధ్వర్యంలో గుడిసెలు వేశారు. గతంలో వివాదాస్పదంగా ఉన్న 174 సర్వే నంబర్ భూమిని ఇటీవల ప్రభుత్వం స్వాధీనపర్చుకుంటున్నట్టు ప్రకటించగా, ఆ స్థలాన్ని ఇళ్ల స్థలాలకు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు సీపీఎం, ప్రజాసంఘాలు శనివారం ఉదయం ఆ స్థలంలో గుడిసెలు వేస్తుండగా విషయం తెలుసుకున్న ఎస్ఐ సతీష్ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. గత పరిస్థితుల దృష్ట్యా సీఆర్‌పీఎఫ్ బలగాలను రప్పించారు. ఏసీపీ దామోదర్‌రెడ్డితో పాటు సీఐ సాయిరమణ, తహసీల్దార్ విశాలాక్షి, ఎస్ఐలు, మహిళా పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేయడం చట్ట విరుద్ధమని, వెంటనే గుడిసెలు తొలగించాలని ఆదేశించారు. ఇందుకు వారు ససేమిరా అనడంతో నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, లేదంటే ఇబ్బందులు ఎదురవుతాయని నచ్చజెప్పేందుకు యత్నించారు. అయినప్పటికీ అక్కడి నుంచి కదలకపోవటంతో నాయకులు సుంచు విజేందర్‌తో పాటు, రామగళ్ల అశోక్, మణి, కర్రె ఉదయ్, మరి కొందరిని అదుపులోకి తీసుకునే యత్నంలో తోపులాట జరిగింది. కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. మహిళలపై మగపోలీసులు దూసుకురావటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినప్పటికీ సీపీఎం నాయకులను అరెస్టుచేసి నర్మెట పీఎస్‌కు తరలించారు. కాగా, మహిళలు అక్కడే ఉండి గుడిసెలు వేస్తుండగా పోలీసులు జీపీ సిబ్బంది సహాయంతో వాటిని తొలగించి మహిళలను అక్కడినుంచి పంపించారు. అనంతరం సీపీఎం నాయకులను వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ ఆందోళనలో గోపాల్‌నగర్‌తో పాటు పలు గ్రామాల పేదలు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో రెవెన్యూ ఉద్యోగుల నిరసన

జఫర్‌గడ్, మార్చి 16: జనగామ డిప్యూటీ తహసీల్దార్ జగన్‌పై దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం భోజన విరామ సమయంలో జఫర్‌గడ్ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అంబటి ఆంజనేయులు, ట్రెస్సా జనగామ జిల్లా అధ్యక్షుడు బాసెట్టి హరిప్రసాద్, కోశాధికారి శ్రీనివాస్, టీఎన్‌జీవో అధ్యక్షుడు ఖాజా షరీఫ్, కార్యదర్శి పెండెం శ్రీనివాస్, ఘన్‌పూర్ డీటీ విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు రాజనర్సయ్య, అనిల్‌కుమార్, కృష్ణ, యాకయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉద్యోగులకు భరోసా కల్పించాలి'

జనగామ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): విధుల్లో ఉన్న ఉద్యోగులు స్వేచ్ఛగా పనిచేసుకునేలా వారికి భరోసా కల్పించాలని టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు ఖాజాషరీఫ్ కోరారు. జనగామ డిప్యూటీ తహసీల్దార్ జగన్‌పై శుక్రవారం జరిగిన దాడి నేపథ్యంలో ఈ మేరకు అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ)ను శనివారం ఆయన చాంబర్‌లో కలిసి సమస్యను విన్నవించినట్లు తెలిపారు. కింది స్థాయి ఉద్యోగులపై దాడులు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరామన్నారు. దీనిపై అడిషనల్ కలెక్టర్ స్పందిస్తూ.. కలెక్టర్ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట జిల్లా కార్యదర్శి పెండెల శ్రీనివాస్, నాయకులు ఎండి.హఫీజ్, శ్రీధర్, నాగార్జున తదితరులు ఉన్నారు.

ఆశ్రమ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

జఫర్‌గడ్, మార్చి 16: మండలంలోని రేగడితండా పరిధిలోని మా ఇల్లు ప్రజాదరణ ఆశ్రమం టెన్త్ విద్యార్థులకు ఆర్యవైశ్య అనుబంధ ఆవోపా మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం పరీక్షా సామగ్రిని అందజేశారు. ఆశ్రమ నిర్వాహకులు గాదె పుష్ప సమక్షంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, తదితర సామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆవోపా మండల అధ్యక్షుడు అంచూరి సురేశ్ మాట్లాడుతూ ఆశ్రమ విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ప్రతీ ఏటా చేయూతనందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆవోపా ప్రతినిధులు బెలిదె పూర్ణచందర్, దొడ్డ రాజ్‌కుమార్, బజ్జూరి మెడికల్ కృష్ణమూర్తి, అంచూరి కమల, బోనగిరి శ్రవణ్‌కుమార్, గందె సోమన్న, దాంశెట్టి సోమేశ్వర్, బజ్జూరి పద్మ, దొడ్డ రంజిత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఎన్నిక

లింగాలఘణపురం, మార్చి16: లింగాలఘణపురం మండల కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. అధ్యక్షుడిగా చిటుకుల అశోక్, కార్యదర్శిగా కొత్తకొండ ప్రణయ్‌చరణ్, కోశాధికారిగా బాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని అసోసియేషన్ కార్యదర్శి దేవరాజ్ తెలిపారు.